క్లుప్తంగా

నేడు జూనొసిస్ డే

చిట్వేలి : స్థానిక ఏరియా పశువుల ఆసుపత్రిలో గురువారం జూనొసిస్ డేను నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ అధికారి వరప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెంపుడు కుక్కలకు చికిత్సతోపాటు ఉచితంగా రాబిస్ వ్యాధి నిరోధక వ్యాక్సిన్ వేస్తామన్నారు. పెంపుడు కుక్కల యజమానులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వరప్రసాద్ కోరారు.

సహకార రుణాలను సద్వినియోగం చేసుకోండి

లక్కిరెడ్డిపల్లె : సహకార రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సంఘం పర్సనల్ ఇన్‌చార్జ్ సిద్ధక రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మద్దిరేవుల సహకార సంఘం కార్యాలయంలో 2023వ సంవత్సరం ఖరీఫ్‌కు సంబంధించి 18 మంది రైతులకు రూ.15.42 లక్షల చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో తీసుకున్న దీర్ఘకాలిక రుణాలు రైతులు సకాలంలో చెల్లించి మరలా కొత్త రుణాలను పొందాలన్నారు. కార్యక్రమంలో సీఈఓ సుబ్బారెడ్డి, మేనేజర్ అశోక్ కుమార్, సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

9న శాకంబరి అలంకరణలో నల్లగంగమ్మ

సంబేపల్లె : దేవరరాయి నల్లగంగమ్మ ఈ నెల 9వ తేదీ ఆదివారం శాకంబరీదేవి అలంకరణలో దర్శనమివ్వనున్నట్లు ఆలయ చైర్మన్ మురళీస్వామి బుధవారం తెలిపారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించనున్నట్లు తెలియజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సూచించారు.

పాఠశాలల బంద్ విజయవంతం

రాయచోటి అర్బన్/రాజంపేట టౌన్ : రాయచోటి, రాజంపేట పట్టణాల్లో బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల బంద్ విజయవంతమైంది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా ఫీజుల దోపిడీ, కనీస వసతుల కల్పన లేమి, అనధికార హాస్టళ్ల నిర్వహణ తదితరాలను అరికట్టాలంటూ ఏబీవీపీ నేతలు బుధవారం బంద్‌కు పిలుపునిచ్చారు. స్పందించిన ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు స్వచ్ఛందంగా మూసివేయడంతో బంద్ ప్రశాంతంగా ముగిసింది.

పరామర్శ



రాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : మండల పరిధిలోని చిన్నకొత్తపల్లి, దర్జిపల్లె గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్సీ రామచంద్రయ్య పర్యటించారు. ఈ సందర్భంగా కొద్దిరోజుల క్రితం ఎమ్మెల్సీ రామచంద్రయ్యకు పరిచయస్తుడైన బొబ్బిలి రాయుడు తమ్ముడు బాబు చనిపోవడంతో చిన్నకొత్తపల్లికి చేరుకుని బొబ్బిలి రాయుడుని, బాబు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అలాగే మండలంలోని దర్జిపల్లె గ్రామంలో కొద్ది రోజుల కిందట ఎమ్మెల్సీ రామచంద్రయ్యకు పరిచయస్తుడైన తాతిరెడ్డి సుబ్బారెడ్డి అనారోగ్యం కారణంగా చనిపోవడంతో దర్జిపల్లెకు వెళ్లి సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు.

నివాళి

ఓబులవారిపల్లె : ముఖ్యమంత్రి సలహాదారు ఆర్.ధనుంజయరెడ్డి చిన్నాన్న, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వి.కె నరసారెడ్డి (65) బుధవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ధనుంజయరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, పంజం సుకుమార్ రెడ్డి, పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, చిట్వేలి మండల కన్వీనర్ శ్రీనివాసులు రెడ్డి, మాజీ ఎంపీపీ రామకృష్ణయ్య, సి.గురివిరెడ్డిలు మృతునికి నివాళి అర్పించారు.

అటవీ నిర్మాణానికి భూముల పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సిద్ధవటం : అటవీ నిర్మాణానికి రెవెన్యూ భూములను ఇచ్చేందుకు బుధవారం సాయంత్రం అటవీశాఖ, రెవెన్యూ అధికారులు భూములను పరిశీలించారు. ఫారెస్టు భూములు కడప–తిరుపతి, హైవే రహదారికి, బెంగుళూరు, విజయవాడ, కడప హైవే రహదారులకు ఫారెస్టు భూములను తీసుకున్నారు. అందుకు ప్రత్యామ్నయంగా మండలంలోని శేఖరాజుపల్లె, ముమ్మడిగుంట పల్లె గ్రామాల్లోని సర్వే నెంబర్ – 405లో 613 ఎకరాల రెవెన్యూ భూములు ఉండటంతో అటవీశాఖకు 200 ఎకరాల భూమి ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు స్థలంతోపాటు మ్యాప్‌లు, రికార్డులను అటవీశాఖ అధికారులుకు చూపించారు. కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, కడప డీఎఫ్ఓ సందీప్ రెడ్డి, కడప రేంజర్ ప్రసాద్, సిద్ధవటం తహసీల్దారు లక్ష్మిదేవి, డిప్యూటీ తహసీల్దారు రాజేష్‌క్రిష్ణ, ఆర్ఐ అనూరాధ, ఎఫ్ఎస్ఓ శ్రీనివాసులు, ఎఫ్‌బీఓ గంగాధర్, కిషోర్‌కుమార్, వీఆర్ఓ ప్రభాకర్‌రెడ్డి, విలేజ్ సర్వేయర్‌లు ఇమ్మానుయేలు, కరీమ్, పురుషోత్తం రెవెన్యూ సిబ్బంది, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ పాలనలో అధికారులే ప్రజల చెంతకు

- సమస్యలు తెలుసుకొని అక్కడికక్కడే ధృవీకరణ పత్రాల మంజూరు
- లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేసిన ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



రాజంపేట టౌన్: సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా, మున్సిపల్ చైర్మన్ పోలా తదితరులు

రాజంపేట టౌన్ : ప్రజలు గత ప్రభుత్వానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఒక్కసారి తేడాని గమనించాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని రెండు, మూడు, నాలుగు, ఐదవ వార్డుల ప్రజల కోసం నిర్వహించిన జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలు తమకు కావాల్సిన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోగా వారికి అప్పటికప్పుడే అధికారులు మంజూరు చేశారు. అధికారులు మంజూరు చేసిన సర్టిఫికెట్లను ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు జగన్ ప్రభుత్వం సేవలందిస్తోందని తెలిపారు. సేవ చేయాలన్న తపన ఉన్న జగన్‌కు ప్రజలు ఎప్పుడూ అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, జగనన్న సురక్ష మున్సిపాలిటీ స్పెషలాఫీసర్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి (రాయచోటి టౌన్) : రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ఉండటం మన అదృష్టమని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి అన్నారు. బుధవారం వీరబల్లె మండలంలోని గుర్రప్పగారిపల్లె, మట్లి గ్రామంలోని ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి నాడు ప్రజలు అధికారుల వద్దకు తిరిగే వారిని జగన్ హయాంలో ఏం కావాలో అడిగి మరీ మంజూరు చేస్తున్నారని తెలియజేశారు. అనంతరం లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, మట్లి సర్పంచ్ నాగార్జునాచారి, గుర్రప్పగారిపల్లె సర్పంచ్ విజయలక్ష్మి, సానిపాయి సర్పంచ్ నేతి ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మహేశ్వర రాజు, వీరనాగిరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాగువారిపల్లి సర్పంచ్ ఆధ్వర్యంలో..

పుల్లంపేట : జగనన్న సురక్ష ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని జాగువారిపల్లి సర్పంచ్ రఘురామయ్య తెలిపారు. బుధవారం జాగువారిపల్లి పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజల నుంచి 120 అర్జీలు వచ్చాయని సర్పంచ్ తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహకుమార్, ఎంపీడీఓ రఘురాం, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్ రెడ్డి, కుమార్ రెడ్డి, ఏపీ మాల వెల్ఫేర్ కార్పొరేషన్ కో–డైరెక్టర్ మడగలం శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైస్‌చైర్మన్ ఫయాజుర్ రహిమాన్‌లు కోరారు. పట్టణంలోని అలీమాబాద్ వీధిలో కొత్తపల్లె–2, బేతల్‌కాలనీ, రెడ్డీస్‌కాలనీ సచివాలయాల పరిధిలోని ప్రజలకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే జగనన్న సురక్షను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఆర్ఐ మల్లికార్జున, డీఈ సుధాకర్‌నాయక్, టీపీఓ లక్ష్మి, ఏఈ క్రిష్ణారెడ్డి, మేనేజర్ రాధ, వైఎస్ఆర్‌సీపీ నేతలు షబ్బీర్ అహమ్మద్, కొలిమి చాన్‌బాషా, రియాజ్ అహమ్మద్, వెంకట్రామిరెడ్డి, నిస్సార్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎల్ జిల్లా కార్యదర్శిగా నలికిరి రామయ్య

రాయచోటి అర్బన్ : ఆల్ ఇండియా యూత్ లీగ్ (ఏఐవైఎల్) జిల్లా కార్యదర్శిగా రాయచోటి పట్టణానికి చెందిన నలికిరి రామయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జ్ కాలేషా తెలిపారు. జిల్లా కార్యదర్శిగా ఎంపికైన నలికిరి రామయ్యకు బుధవారం కాలేషా పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు.

ప్రారంభమైన శీతల గంగమ్మ జాతర



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

సిద్ధవటం : పార్వతీపురంలో వెలసిన శీతల గంగమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా బుధవారం గ్రామస్తులు ప్రత్యేకపూజలు నిర్వహించి అమ్మవారికి కోడి పుంజులు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. మరికొందరు అమ్మవారికి కాయాకర్పూలను సమర్పించారు. సాయంత్రం శక్తి పూజ, రాత్రి అమ్మవారి కథ, అమ్మవారి ఊరేగింపుతో గుడికి చేర్చే కార్యక్రమాలను నిర్వహిస్తామని గ్రామ పెద్దలు వివరించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసనాయుడు

రాయచోటి టౌన్ : గొర్రెలకు సీజనల్ వారిగా సోకే వ్యాధులను నివారించుకుంటే లాభసాటిగా ఉంటుందని రాయచోటి పశుసంవర్ధకశాఖ డీడీఏహెచ్ డాక్టర్ శ్రీనివాస నాయుడు గొర్రెల కాపర్లకు, పశుసంవర్ధకశాఖ డాక్టర్లకు సూచించారు. బుధవారం రాయచోటిలోని ఆ శాఖ కార్యాలయంలో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ (ఎన్ఎల్ఎం) నిర్వహణలో భాగంగా పశువుల కాపర్లు (రైతులు), పశువైద్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాల మొదలవుతోందని దీంతో పశువులకు కొత్త గడ్డి మొలకెత్తుతుందన్నారు. ఈ కొత్త గడ్డిలో నుంచి పరాన్న జీవులు గొర్రెల కడుపులోకి వెళ్లి వ్యాధులను కలగజేస్తాయని చెప్పారు. అందుకోసం ప్రభుత్వం అందించే ఉచిత నివారణ మందులు పంపిణీ చేస్తుందని వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అలాగే సీజనల్ వ్యాధులపై గొర్రెల కాపర్లకు ఎప్పటికప్పుడు అవగాహన కలగజేస్తూ రైతులకు మెళకువలు తెలియచేస్తూండాలని సూచించారు. అలాగే మేలిరకం గొర్రెల పెంపకం, వాటిని పోషించే విధానంపై అవగాహన కల్పించారు.

రైతులకు మెరుగైన సేవలందించండి

- జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్

నందలూరు(రాజంపేట) : రైతులకు మెరుగైన సేవలందించడంలో రైతు భరోసా కేంద్రాలు ముందంజలో ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ అన్నారు. బుధవారం నందలూరు–2 రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంత్ర సేవా పథకం అమలు సక్రమంగా జరగాలన్నారు. ఖరీఫ్‌లో పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగయ్యే పంటలకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సరిపడా అందుబాటులో ఉంచాలన్నారు. రైతుభరోసా కేంద్రాల నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండరాదన్నారు. ఆర్‌బీకే లక్ష్యాలను అధగమించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ మల్లికార్జున, వ్యవసాయ సహాయకుడు షణ్ముఖ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్‌బీకే రికార్డులను పరిశీలించారు.

ఫెయిలైన విద్యార్థులు మళ్లీ పాఠశాలకు

రాయచోటి టౌన్ : 10వ తరగతిలో ఫెయిలైన విద్యార్థులు మళ్లీ పాఠశాలలో చేర్చుకొనేలా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని డైట్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోకేశ్వరరెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరాజు తెలియజేశారు. గత నెలలో నిర్వహించిన 10వ తరగతి సప్లిమెంటరీలలో ఫెయిలైన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో తిరిగి చేరుక్కోకోవాలని వారికి అందరిలాగానే జగనన్న విద్యాకానుక కిట్ అందజేస్తామని తెలిపారు. వారికి కావాల్సిన అన్ని రకాల పాఠ్యపుస్తకాలు, దుస్తులు, ఇతరా సామగ్రిని అందిస్తామని చెప్పారు. గత సంవత్సరంలో 15 మంది విద్యార్థులు ఫెయిలయ్యారని వారిలో బుధవారం 6 మందికి ఫోన్ చేసి పాఠశాలకు పిలిపించి తిరిగి పాఠశాలలో చేర్చుకున్నామన్నారు.

నేడు జగనన్న సురక్ష

రామాపురం : మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ సూర్యనారాయణపురం, బండపల్లి పంచాయతీ వెంకటరెడ్డిగారిపల్లెలలోని గ్రామ సచివాలయాలలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బుధవారం ఎంపీడీఓ హైదర్‌వలి, తహసీల్దార్ అరవింద్‌కిషోర్‌లు ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొని సమస్యలు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలోనూ రాణించాలి



సాయికుమార్‌ను అభినందిస్తున్న మానవత సభ్యులు

రాయచోటి టౌన్ : జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాదు జాతీయ స్థాయిలోనూ మెరవాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి తైక్వాండో క్రీడాకారులకు సూచించారు. తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీలో 63కిలోల విభాగంలో సాయికుమార్ తోపాటు పలువురు ప్రతిభ కనబరిచారు. బుధవారం క్రీడాకారుల అభినందన సభ నిర్వహించారు. ఈనెల 7 నుంచి 9 వరకు కర్ణాటక శివమొగ్గలోని నెహ్రూ స్టేడియంలో జరిగే పోటీలకు క్రీడాకారులు ఎంపికవ్వడంతో సంస్థ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి, డైరెక్టర్ యర్రపురెడ్డి బ్రహ్మానందరెడ్డి, మాజీ అధ్యక్షుడు గుండ్లపల్లె వెంకటేష్, తైక్వాండో మాస్టర్ సింగర సాంబ శివయ్య వారి శిష్యులు రియాజ్, సందీప్‌లు పాల్గొన్నారు.

గిరిజనులకు భూ హక్కు పట్టాలివ్వాలి



గిరిజనులతో సమావేశమైన ఏపీ గిరిజన సమాఖ్య నేతలు

రాయచోటి అర్బన్ : శికారుపాళెం గిరిజనులకు వెంటనే వారి సాగులో ఉన్న భూములను అప్పగించని పక్షంలో ఈనెల 7వ తేదీ నుంచి రిలే నిరాహారదీక్షలు చేపడతామని ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విశ్వనాథనాయక్, లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్రనేత శంకర్‌నాయక్‌లు పేర్కొన్నారు. బుధవారం వీరబల్లి మండలం తాటిగుంటపల్లె పంచాయతీలోని శికారుపాళెం గిరిజనులతో వారు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ 1984 నుంచి శికారిపాళెం గిరిజనులు తమపల్లె చుట్టూ ఉన్న అటవీభూములను సాగు చేసుకునేవారన్నారు. గత కొన్నేళ్లుగా ఫారెస్టు అధికారులు సదరు భూములను గిరిజనులు సాగు చేసుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారన్నారు. అధికారులు స్పందించి వెంటనే గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో నిరహార దీక్షలు చేపడతామంటూ హెచ్చరించారు.

విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యత



వాటర్ హార్వెస్టింగ్ ప్రాజెక్టు పరిశీలిస్తున్న బృందం

రాయచోటి టౌన్ : విద్య, వైద్య, వ్యవసాయ రంగానికి తమ ఐసీఐసీ ఫౌండేషన్ అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆ బ్యాంక్ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ శిరీష అన్నారు. బుధవారం రాయచోటి మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాలలోని విద్యార్థుల సౌకర్యార్థం రూ.2లక్షల విలువ చేసే వాటర్ హార్వెస్టింగ్ ప్రాజెక్టు, రూ.3.5లక్షల విలువ చేసే సౌరవిద్యుత్ సరఫరా వ్యవస్థను ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివకుమార్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఫౌండేషన్ అధికారి రాజేశ్వరి, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ ధరణీశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణ పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న డీఈ చంద్రశేఖర్‌రెడ్డి

రైల్వేకోడూరు : నియోజకవర్గంలో నిర్మాణ దశలో ఉన్న సబ్‌స్టేషన్ పనులను బుధవారం విద్యుత్‌శాఖ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. ముఖ్యంగా కోడూరు మండలంలోని బాలుపల్లి, ఓబులవారిపల్లె మండలంలోని గొబ్బురవారిపల్లెలో జరుగుతున్న సబ్‌స్టేషన్ పనులను పరిశీలించినట్టు ఆయన తెలిపారు. చివరి దశలో ఉన్న పనులను వేగంగా నాణ్యతతో పూర్తిచేయాలని తెలియజేశారు. అనంతరం విద్యుత్‌శాఖ ఏడీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏడీ భాస్కర్‌రావు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌ను అందుబాటులోకి తెస్తాం

రాజంపేట టౌన్ : పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ప్రెస్‌క్లబ్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి తెలిపారు. అన్నమయ్య ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యేని కలిసి అసంపూర్తిగా ఉన్న ప్రెస్‌క్లబ్‌ను పూర్తి చేయించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. పాత్రికేయులు కూర్చునేందుకు వీలుగా గదులను తన సొంత డబ్బులతో నిర్మించి ఇస్తానన్నారు. ఈ పనులను త్వరగా ప్రారంభించాలని అక్కడే ఉన్న కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రెస్‌క్లబ్ పూర్తిస్థాయిలో పూర్తయితే గతంలో ఇచ్చిన హామీ మేరకు ఫర్నీచర్‌ను తానే తీయిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు మలిశెట్టి సుబ్బనరసింహులు, గుండ్రాతి విజయ్‌కుమార్, జయరాజ్, గణేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగం ఉద్యమానికి సిద్ధం కావాలి

రాయచోటి అర్బన్ : సమస్యల సాధన కోసం రైతాంగం దశలవారీ ఉద్యమానికి సిద్ధం కావాలని సీపీఐ కడప, అన్నమయ్య జిల్లాల కార్యదర్శులు గాలి చంద్ర, పి.ఎల్.నరసింహులు, ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి.రంగారెడ్డిలు పిలుపునిచ్చారు. బుధవారం రైతు ఉద్యమానికి సంబంధించిన కరపత్రాలను వారు స్థానిక రైతు సంఘం నేతలతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. పాలకులు రైతులను ఆదుకోవడంతో చూపుతున్న నిర్లక్ష్యానికి నిరసగా రైతులు గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలలో ఆందోళనకు దిగాలంటూ వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం అన్ని నియోజకవర్గాల నేతలు, ఏఐటీయూసీ నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంపద కాపాడే బాధ్యత అందరిది



కళావతి

సిద్ధవటం : అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సిద్ధవటం రేంజర్ బి. కళావతి అన్నారు. మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో బుధవారం రేంజర్ మాట్లాడుతూ అటవీ సంపదను ఎవరైనా కొల్లగొడుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న వన్యప్రాణులను కూడా కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వన్యప్రాణులను ఎవరైనా వేటాడినా, చంపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎర్రచందనం అక్రమాలకు పాల్పడిన పాత నేరుస్థులు, వారి కదలికలపై నిఘా ఉంచి ఎప్పటికప్పుడు సమాచారం అధికారులకు తెలియజేయాలని సిబ్బందికి సూచించామన్నారు. లంకమల్ల అడవుల్లో ఎకో టూరిజంను అభివృద్ధి చేయడానికి ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారని ఆమె తెలిపారు.